
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
బుధవారం 10 జనవరి 2024

లాటరీ పేరుతో కుచ్చుటోపీ

- అనుమానం రాకుండా కొందరికి ఖరీదుకానీ వస్తువుల పంపకాలు
- ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.3 వేల నుంచి రూ.7 వేల వరకు వసూళ్లు
- లబోదిబోమంటున్న బాధితులు

·8లో

ఎంపీ మాధవికి నిరసన సెగ

అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆమె నియామకాన్ని వ్యతిరేకిస్తున్న పార్టీలోని ఓ వర్గం

- వైఎస్ విగ్రహానికి నివాళులర్పించేందుకు రాగా అడ్డుకునేందుకు యత్నం
- 'గో బ్యాక్' అంటూ నినాదాలు
- పోలీసుల సాయం తీసుకున్న మాధవి



అరకులోయలో వైఎస్ విగ్రహం వద్దకు వెళుతున్న ఎంపీ మాధవిని అడ్డుకుంటున్న కొంతమంది నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

అరకులోయ, జనవరి 9: అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ సమన్వయకర్తగా ప్రస్తుత ఎంపీ గొడ్డేటి మాధవిని నియమించడాన్ని పార్టీలోని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మంగళవారం నియోజకవర్గానికి వచ్చిన ఆమెను అడ్డుకునేందుకు యత్నించింది. వివరాలిలా ఉన్నాయి. ఎంపీ మాధవిని వారం కిందట అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అధిష్ఠానం ప్రకటించింది. అప్పటినుంచి నియోజకవర్గంలో పార్టీ నేతలు పలువురు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానికేతరురాలైన ఆమె అభ్యర్థిత్వాన్ని అంగీకరించేది లేదని హెచ్చరిస్తున్నారు. ఇటువంటి పరిణామాల నేపథ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర (ప్రజా సంకల్ప యాత్ర) నిర్వహించి ఐదేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రంలో పార్టీ కార్యక్రమం ఏర్పాటు నిమిత్తం మంగళవారం మాధవి విశాఖపట్నం నుంచి రైలులో అరకులోయ చేరుకున్నారు. ఆమెకు అరకులోయ జెడ్పీటీసీ సభ్యురాలు రోష్ని, వైస్ ఎంపీపీ సుమంజలి, ఎంపీటీసీ సభ్యులు ఆనందరావు, డుంబ్రిగుడ వైస్ ఎంపీపీ లలిత, పద్మాపురం సర్పంచ్ సుస్మిత, తదితరులు స్వాగతం పలికారు. వారితో కలిసి తహసీల్దార్ కార్యాలయం నుంచి నాలుగురోడ్ల జంక్షన్‌లో గల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్దకు వస్తుండగా పార్టీ నాయకుడు సమర్డి రఘునాథ్, హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, హుకుంపేట మాజీ ఎంపీపీ బత్తిరి రవిప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కాసులమ్మ, అరకులోయ, హుకుంపేట మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పాడి రమేష్, రేగం రమేశ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు అడ్డుకునేందుకు యత్నించారు. 'గో బ్యాక్ మాధవి' అంటూ నినాదాలు చేశారు.

అయితే కాసేపు వేచిచూసిన ఆమె అనంతరం తన మద్దతుదారులతో కలిసి పోలీసుల సహకారంతో నిరసనకారులను నెట్టుకుంటూ వెళ్లి వైఎస్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం అందరికీ అభివాదం చేస్తూ జై జగనన్న, జై వైసీపీ అంటూ నినాదాలు చేస్తూ కిందకు దిగారు. మరోవైపు ఆమెకు వ్యతిరేకంగా నినాదాలతో అసమ్మతివాదులు హోరెత్తించారు. ఈ నేపథ్యంలో ఆమె సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకూ నడుచుకుంటూ వెళ్లి అక్కడ విలేకరులతో మాట్లాడారు. తనకు టికెట్ కేటాయించింది, ఇన్‌చార్జిగా నియమించిందీ అధిష్ఠానమంటూ..ఏమైనా అభ్యంతరాలుంటే పార్టీ పెద్దలతో మాట్లాడుకోవాలన్నారు. గర్భిణినైన తనను విచక్షణారహితంగా అడ్డగించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ తోపులాటలో జెడ్పీటీసీ సభ్యురాలు రోష్నీ తలపై కొట్టారన్నారు. పార్టీ నిర్ణయమే తన నిర్ణయమన్నారు. తనను అరకు ఎంపీగా ఏ విధంగా అక్కున చేర్చుకున్నారో అదేవిధంగా, అసెంబ్లీకి కూడా భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



మాధవికి వ్యతిరేకంగా బ్యానర్ల ప్రదర్శన, నినాదాలు



పాడేరులో రోడ్డుపై బైఠాయించిన అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నాయకులు

అంగన్‌వాడీల జైల్ భరో

- ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా ఆందోళన
- పాడేరులో అంగన్‌వాడీ సంఘ నాయకుల అరెస్టు



జైల్ భరోలో పాల్గొన్న అంగన్‌వాడీ సంఘ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పలు రకాలుగా బెదిరించడంతో పాటు ఎస్మా ప్రయోగించడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె మంగళవారానికి 29వ రోజుకు చేరింది. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ మంగళవారం పాడేరు ఐటీడీఏ కార్యాలయం ముందు జైల్ భరో కార్యక్రమాన్ని చేపట్టి అంగన్‌వాడీలు తమ సత్తా చాటారు.

జైల్ భరో నిర్వహించిన పలువురు సీఐటీయూ, అంగన్‌వాడీల సంఘ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అయినప్పటికీ అంగన్‌వాడీలు ఏమాత్రం తగ్గకుండా ఐటీడీఏ కార్యాలయం ముందు మెయిన్‌రోడ్డుపై తమ ఆందోళనను కొనసాగించారు. అనంతరం వారంతా నిరసన శిబిరంలోనూ కూర్చొని తమ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ బెదిరింపులకు భయపడబోమని గట్టిగా నినాదాలు చేశారు.

కాగా అరకులోయలో శిబిరం పక్కనే ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసేందుకు ఎంపీ గొడ్డేటి మాధవికి మంగళవారం రాగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. చింతపల్లి దీక్షా శిబిరంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు సీఎం జగన్ వైఖరికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. డుంబ్రిగుడలో యూనియన్ బ్యాంకు సమీపంలోని జాతీయ రహదారిపై అంగన్‌వాడీలు ఆందోళన చేశారు. ముంచంగిపుట్టులో కార్యకర్తలు జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించారు.

దంపతులను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్

భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్

పాడేరురూరల్, జనవరి 9: **ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులను వెనుక నుంచి ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొనడంతో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. పాడేరు ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో మంగళవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.**



గిరిజ (ఫైల్ ఫొటో)

మండలంలోని వనుగుపల్లి పంచాయతీ కేంద్రానికి చెందిన పూజారి రామకొండ(45), ఆయన భార్య గిరిజ (42) ద్విచక్ర వాహనంపై పాడేరు బయలుదేరారు. కిండంగి పంచాయతీ నక్కలపుట్టు గ్రామం దాటిన తరువాత ఎస్పీ కార్యాలయానికి సమీపానికి వచ్చే సరికి మైదాన ప్రాంతం నుంచి పాడేరు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ వెనుక నుంచి వీరి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో రామకొండ రోడ్డు పక్కన పడిపోగా, ఆయన భార్య గిరిజ ట్యాంకర్ వెనుక చక్రం కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాల పాలైన రామకొండను స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్‌ఐ జి.రంజిత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రానున్న ఎన్నికలకు సన్నద్ధం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

అరకులోయ, జనవరి 9: జిల్లాలో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకుని వచ్చే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి తెలిపారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఆమె మంగళవారం మధ్యాహ్నం అరకులోయలోని టీటీడీ కళ్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. వారి ఉత్సాహం చూస్తుంటే జిల్లాలో పార్టీ ఎంత బాగా బలపడిందో తెలుస్తున్నదన్నారు. వైసీపీ ఎంపీనే గోబ్యాక్ అంటూ అదే పార్టీ నేతలు నిరసన వ్యక్తం చేస్తున్న పరిస్థితి అరకులోయలో ఉందన్నారు. అటువంటి వారిని ఎన్నుకోవడం వల్ల గిరిజనులకు ఒరిగేది ఏమి లేదన్నారు. తన రెండు రోజుల పర్యటనలో పలు ఉపాధ్యాయ సంఘాలు, ఇతర సంఘాలను కలిశామన్నారు. గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన నాయకులు, పోటీ చేసి ఓటమి పాలైన నాయకులతో సమావేశమై రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ఏం చేయాలనే దానిపై చర్చించామన్నారు. ఈ సమావేశంలో పార్టీ అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి గీత, అరకు అసెంబ్లీ కన్వీనర్ బి.ధర్మరాజు, పాడేరు కన్వీనర్ కూడ కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షుడు కేవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిమజాతి గిరిజన పల్లెలకు విద్యుత్ సదుపాయం

ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్



లగిశపల్లి సచివాలయ సిబ్బందితో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ మహేంద్రనాథ్

పాడేరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ప్రతి ఆదిమ జాతి గిరిజన పల్లెకు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ(ఏపీ ఈపీడీసీఎల్) సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. పాడేరు మండలంలోని ఆదిమ జాతి గిరిజన పల్లెలకు విద్యుత్ సదుపాయాల స్థితిగతులపై ఆరా తీసేందుకు మంగళవారం ఇక్కడికి వచ్చిన ఆయన లగిశపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ప్రతి ఆదిమ జాతి గిరిజన పల్లెకు విద్యుత్ సదుపాయం కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సచివాలయ సిబ్బంది తమకు సహకరించాలన్నారు. ఏజెన్సీలో విద్యుత్ లేని ఆయా గ్రామాలను గుర్తించి, విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఉద్యోగాలు చేస్తున్న గిరిజన ఉద్యోగులు విద్యుత్ రాయితీని వదులుకోవాలని ఆయన కోరారు. అలాగే లగిశపల్లి సచివాలయం పరిధిలో విద్యుత్ రాయితీ పొందుతున్న ఉద్యోగులు లేకపోవడంపై సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తారాబు జలపాతం వద్ద పర్యాటకులు

తారాబు జలపాత సౌందర్యం

మండలంలోని జామిగూడ పంచాయతీలోని తారాబు జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విద్యా సంస్థలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో కుటుంబ సమేతంగా పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు. మంగళవారం అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో సందడిగా ఉంది. ఎత్తైన కొండల పైనుంచి జాలువారుతున్న పాలధార వంటి నీళ్లను చూసి వీరంతా పరవశించిపోయారు. ఈ దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు.

- పెదబయలు

కాస్త తగ్గిన చలి

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావమే కారణం

- జి.మాడుగులలో 13.5, పాడేరులో 14.7, అరకులోయ, జీకేవీధిలో 14.8 డిగ్రీలు



చింతపల్లిలో కురుస్తున్న మంచు

పాడేరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఏజెన్సీలో చలి ప్రభావం కాస్త తగ్గింది. మంగళవారం జి.మాడుగులలో 13.5, పాడేరులో 14.7, అరకులోయ, జీకేవీధిలో 14.8, చింతపల్లిలో 15.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత మూడు రోజుల క్రితం ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు రావడంతో ఏజెన్సీ వాసులు వణికిపోయారు. ఈ క్రమంలో దక్షిణ శ్రీలంక నుంచి నైరుతి బంగాళాఖాతం వరకు ద్రోణి ఏర్పడడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా మంగళవారం ఏజెన్సీలో పొగమంచు పెద్దగా కురవలేదు. అయితే ఆకాశం మేఘావృతం కావడంతో పెద్దగా ఎండ కాయలేదు.

జీకేవీధి, చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో చలి ప్రభావం కాస్త తగ్గింది. మంగళవారం జీకేవీధిలో 14.8, చింతపల్లిలో 15.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు.



తారుమారు సంతకు భారీగా తరలివచ్చిన జనం

సందడిగా తారుమారు సంత

- భారీగా తరలివచ్చిన జనం



డప్పు వాయిద్యాలు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

జి.మాడుగుల, జనవరి 9: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన తారుమారు సంతకు జనం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి ఏటా సంక్రాంతి పండగ ముందు వారం తారుమారు సంతకు అన్ని మండలాల నుంచి గిరిజనులతో పాటు మైదాన ప్రాంతాలకు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

దోనె తిరగబడి వృద్ధుడి మృతి

మునగపాక, జనవరి 9: మండలంలోని వాడ్రాపల్లి పరిధిలో వున్న ఆవలో దోనె తిరగబడి వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాడ్రాపల్లికి చెందిన పిల్లా గంగరాజు(62) దోనె సాయంతో ఆవలో చేపల వేట సాగిస్తుంటాడు. రోజూ మాదిరిగానే మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకు సహచర మత్స్యకారులతో కలసి దోనెపై చేపల వేటకు వెళ్లాడు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత గంగరాజు మినహా మిగిలిన వారంతా ఒడ్డుకు వచ్చారు. గంగరాజు కోసం ఆవలో గాలింపు చర్యలు చేపట్టారు. ఒకచోట దోనె తిరగబడి కనిపించింది. దానిని పైకెత్తి చూడగా గంగరాజు నిర్జీవంగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఆవ నుంచి ఒడ్డుకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపారు.

800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

నర్సీపట్నం అర్బన్, జనవరి 9: మండలంలోని గురందొరపాలెం శివారు తోటల్లో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల బెల్లం పులుసును నర్సీపట్నం రూరల్ ఎస్ఐ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ధ్వంసం చేశారు. గురందొరపాలెం గ్రామం వద్ద తోటల్లో నాటుసారా తయారు చేస్తున్నట్టు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్టు ఎస్ఐ తెలిపారు. గోతుల్లో దాచిపెట్టిన పులుసును ధ్వంసం చేసినట్టు తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలు.. రెండు వాహనాలు సీజ్

అచ్యుతాపురం, జనవరి 9: మండలంలోని నునపర్తి పంచాయతీ నడింపల్లి గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో వైసీపీ నాయకులు గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుపుతున్నట్టు తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు మంగళవారం సాయంత్రం తహసీల్దార్ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ సోమేశ్‌కుమార్, వీఆర్వో శశిధర్ అక్కడకు వెళ్లారు. గ్రావెల్ తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్, గ్రావెల్ రవాణా చేస్తున్న టిప్పర్ లారీని సీజ్ చేశారు. అనంతరం మండల కేంద్రానికి తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు.


రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్, టిప్పర్ లారీ

పింఛన్ నగదుతో పంచాయతీ కార్యదర్శి పరారీ

పాడేరు రూరల్, జనవరి 9: పాడేరులోని మారుమూల సలుగు పంచాయతీలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన పింఛన్ సొమ్ముతో కార్యదర్శి పరారయ్యారు. దీంతో 9వ తేదీ వచ్చినప్పటికీ లబ్ధిదారులకు పింఛన్ అందలేదు. పంచాయతీ కార్యదర్శి కె.బాలకృష్ణ 32 మంది లబ్ధిదారులకు సంబంధించిన పింఛన్ నగదు రూ.96 వేలును పాడేరు బ్యాంకులో ఈ నెల 1వ తేదీన విత్‌డ్రా చేశారు. ఈ నగదును సలుగు పంచాయతీకి వెళ్లి వలంటీర్లకు అందించి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే వలంటీర్ వచ్చి పింఛన్ ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆరా తీశారు. దీంతో కార్యదర్శి పింఛన్ నగదు ఇవ్వలేదని తెలిసి ఈ నెల 7వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎంపీడీవో కె.సాయినవీన్ పింఛన్ నగదు డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శి గురించి ఆరా తీయగా, ఎటువంటి సమాచారం లేదు. దీంతో పింఛన్ల పంపిణీకి ఈ నెల 10వ తేదీ వరకు సమయం ఉన్నందున వేచి చూడాలని, అప్పటికీ పంపిణీ చేయకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో తెలిపారు.

10 లీటర్ల నాటుసారా, 48 మద్యం సీసాలు స్వాధీనం

పాయకరావుపేట, జనవరి 9: పోలీసులు మంగళవారం రెండుచోట్ల దాడులు నిర్వహించి 10 లీటర్ల నాటుసారా, 48 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించి ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఐ జోగారావు, సిబ్బందితో కలిసి పట్టణంలోని పాతపేట శివారులో తనిఖీలు నిర్వహించారు. కందూరి పైడితల్లి నుంచి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని మంగవరం గ్రామంలో ఒక ఇంటిలో నిల్వ ఉంచిన 48 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని గీసాల లక్ష్మి, గీసాల శివలను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి ఎలమంచిలి కోర్టుకు తరలించారు.


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

బీజేపీ, వైసీపీలను ఓడించాలి


సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం. చిత్రంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కొప్పుల రాజు, తదితరులు ఉన్నారు

» కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాల్లో నిరంకుశ విధానాలకు అమలుచేస్తున్న బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలను ఓడించేందుకు భావ సారూప్యత కలిగిన పార్టీలు ముందుకురావాలని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ, ప్రజా సంఘాల నేతలతో మంగళవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో సమాలోచన పేరుతో సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జేడీ శీలం మాట్లాడుతూ బీజేపీ, వైసీపీలను ఓడించి ఇంటికి సాగనంపాలని, లేకపోతే అరాచక పాలన మరోసారి చవిచూడాల్సి వస్తుందన్నారు. విభజన చట్టంలోని హామీల అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రభుత్వ రంగ సంస్థలకు రక్షణ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు కొప్పుల రాజు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ జోడో యాత్ర తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుందన్నారు. దాని ఫలితంగానే కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. మణిపూర్‌లో దారుణాలు జరిగినా, క్రీడాకారులు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేసినా మోదీ కనీసం స్పందించలేదన్నారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అప్పులతో దేశంలో, రాష్ట్రంలోని ప్రజలపై భారం పడుతోందన్నారు. ప్రతినెలా జీతాలు ఇచ్చేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని, ఈ పరిస్థితి మారాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. అణగారిన వర్గాలపై అణచివేతలు పెరుగుతున్నాయని, చట్టాలు అండగా ఉండడం లేదని, బాధితులపైనే కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి ఉదాహరణ కోడి కత్తి శ్రీను కేసును ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో కుట్ర కోణం లేదని ఎన్ఐఏ కోర్టు చెప్పినప్పటికీ బెయిల్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో దళితుల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్‌రెడ్డి, సీపీఐ నుంచి పైడిరాజు, విరసం ఐక్య వేదిక వెంకటరావు, దళిత హక్కుల ఐక్య ఐక్య వేదిక పోరాట సమితి నాయకులు కొత్తపల్లి వెంకటరమణతోపాటు వివిధ వర్గాలకు చెందిన నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	65.00
లైవ్ ధర	85.00
విత్ స్కిన్	140.00
స్కిన్ లెస్	150.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చదువు, ఆరోగ్యమే నిజమైన సంపద

» కిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య
» మాతృభాషపై పట్టు ఉండాలి
» రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ
» ఘనంగా శ్రీప్రకాష్ విద్యా సంస్థల వార్షికోత్సవం


మాట్లాడుతున్న కిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య


మాట్లాడుతున్న రిటైర్డ్ స్పెషల్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ


ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రిటైర్డ్ స్పెషల్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ

పాయకరావుపేట, జనవరి 9: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే నిజమైన సంపద చదువు, ఆరోగ్యమేనని కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య అన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల 47వ వార్షికోత్సవ వేడుకలను 'జోష్' పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి విద్యార్థి గ్రహించాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. బాగా చదువుకుని, ఆరోగ్యం వుంటే కచితంగా ఉన్నతస్థితికి చేరుకుంటారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మాతృభాషపై పట్టు వుంటేనే మిగిలిన భాషలపై పట్టు సాధించగలమని అన్నారు. జీవితంలో ఉత్తమ మార్గాన్ని ఎంచుకునే శక్తిసామర్థ్యం చదువు ద్వారానే వస్తుందన్నారు. మరో గౌరవ అతిథి బసవ తారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ, ఎటువంటి స్వార్థం లేకుండా జ్ఞానాన్ని పంచే గురువులను విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. జీవితంలో పైకి ఎదగాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. సెకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కొడాలి కేశవరావు, అడ్వాన్స్‌డ్ మైనింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నాదెళ్ల వెంటసుబ్బారావు, ప్రతాప్ ఇండస్ట్రీస్ ఎండీ వైవీఎస్.చలపతిరావు తదితరులు మాట్లాడారు. తొలుత ఏపీ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయస్థాయి ఆటల పోటీలు, వివిధ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా, పిరమిడ్స్, జుంబా డ్యాన్స్, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, ,విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

» రానున్నది టీడీపీ ప్రభుత్వమే
» అన్ని వర్గాల ప్రజలను మోసగించిన సీఎం జగన్
» మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు


పారిశుధ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 9: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. పారిశుధ్య కార్మికుల సమ్మెకు బుధవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని చెప్పారు.

పురపాలక శాఖా మంత్రి, ముఖ్యమంత్రి, ముఖ్య కార్యదర్శి సమ్మెలో ఉన్న కార్మికులను పట్టించుకోకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను సీఎం జగన్ మోసం చేశారని ఆరోపించారు. రోడ్డు విస్తరణ పనులకు మునిసిపాలిటీ నిధులు ఖర్చు పెట్టేస్తున్నారని అన్నారు. నాలుగున్నర సంవత్సరాల తరువాత చివరిక్షణంలో ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టారని విమర్శించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు 100 అడుగులు, అక్కడ నుంచి 90 అడుగులు రోడ్డు విస్తరణ చేస్తామంటున్నారని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు రూ.35 లక్షలు మునిసిపాలిటీ నిధులు వాడేశారని విమర్శించారు. ఆర్ అండ్ బీ శాఖ నుంచి నిధులు తెచ్చుకునే దమ్ము ఎమ్మెల్యేకి లేక మునిసిపాలిటీ నిధులు వాడేస్తున్నారని విమర్శించారు. పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, నేతల నాగేశ్వరరావు, ధనిమిరెడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని ఇచ్ఛాపురం టు తిరుపతి పాదయాత్ర

» అశోక్ బృందానికి స్వాగతం పలికిన టీడీపీ నాయకులు


అశోక్ బృందాన్ని సత్కరిస్తున్న బుద్ద నాగజగదీశ్

తుమ్మపాల, జనవరి 9: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ నెల్లూరు జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజా సంక్షేమ విభాగం అధ్యక్షుడు అశోక్, అతని అనుచరులు ఇచ్ఛాపురం నుంచి తిరుపతి వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం సాయంత్రం అనకాపల్లి చేరింది. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, స్థానిక నేతలు.. పాదయాత్ర బృందానికి స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. రాష్ట్రంలో మరో మూడు నెలల్లో సైకో పాలన పోవడం, చంద్రబాబునాయుడు సీఎం అవ్వడం తథ్యమని నాగజగదీశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సాలాపు నాయుడు, బీవీవీ అప్పారావు పాల్గొన్నారు.

గ్రేటర్ బడ్జెట్ రూ.5,457.23 కోట్లు

» గత ఏడాది కంటే రూ.1,393.74 కోట్లు అధికం
» ఇంజనీరింగ్ విభాగానికి 25.04 శాతం కేటాయింపు
» ప్రాజెక్టులకు 19.19 శాతం కేటాయింపు
» ప్రజారోగ్యానికి 9.64 శాతం
» రూ.4,949.89 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనా
» విపక్షాల అభ్యంతరాల నడుమ బడ్జెట్ ముసాయిదాకు ఆమోదం తెలుపుతున్నట్టు మేయర్ ప్రకటన


మేయర్ పోడియం వద్ద విపక్షాల ఆందోళన



విశాఖపట్నం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,457.23 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పాలకవర్గం ఆమోదించింది. బడ్జెట్‌పై చర్చించేందుకు మంగళవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేకంగా సమావేశమైంది. అయితే విపక్షాలు పలు అభ్యంతరాలు వ్యక్తంచేసినా మేయర్ పట్టించుకోకుండా బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్టు ప్రకటించి, పోడియం దిగి వెళ్లిపోయారు. తొలుత సమావేశం ప్రారంభమైన తర్వాత బడ్జెట్ ముసాయిదాను మేయర్ గొలగాని హరివెంకటకుమారి చదువుతుండగా టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆమె పోడియాన్ని చుట్టుముట్టారు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై ముందుగా చర్చించాలని, వారి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మేయర్ స్పందిస్తూ ఇది బడ్జెట్ సమావేశం కాబట్టి, ఇతర అంశాలపై చర్చించకూడదని, సమావేశం ముగిసిన తర్వాత ఫ్లోర్‌లీడర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని చెప్పడంతో అందరూ తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చున్నారు. అనంతరం బడ్జెట్‌లో ప్రతిపాదనలను చదివి వినిపించారు. 2023-24 బడ్జెట్‌తో పోల్చితే కొత్త బడ్జెట్ రూ.1,393.74 కోట్లు (34 శాతం) అధికం కావడం విశేషం. భవిష్యత్తులో నగరంలో రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం, సుందరీకరణ పనులు చేయాల్సి ఉంటుందనే ఉద్దేశంతో ఇంజనీరింగ్ విభాగానికి భారీగా కేటాయింపులు చూపించారు. మొత్తం బడ్జెట్‌లో 25 శాతానికిపైగా అంటే రూ.1,366.36 కోట్లు ఇంజనీరింగ్ విభాగానికే కేటాయించారు. ఇక పలు కొత్తప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉండడంతో రూ.1,054.45 కోట్లు కేటాయింపులు చూపించడం విశేషం. మొత్తం బడ్జెట్‌లో రూ.176.09 కోట్లు సాధారణ పరిపాలన విభాగానికి, వీధి దీపాల నిర్వహణకు రూ.163.65 కోట్లు, టౌన్‌ప్లానింగ్ విభాగానికి రూ.63.41 కోట్లు, పార్కులు, శ్మశానాలు, సమాధుల పరిరక్షణ, అభివృద్ధికి రూ.181.35 కోట్లు, ప్రజారోగ్యానికి రూ.526.11 కోట్లు, నీటి సరఫరా విభాగానికి రూ.359.99 కోట్లు, అమృత్ పథకానికి రూ.504 కోట్లు, ఆర్థిక సంఘం నిధులతో చేసే పనుల కోసం రూ.498.4 కోట్లు, విదేశీ నిధులతో చేపట్టే ప్రాజెక్టులకు రూ.191.05 కోట్లు, యూసీడీ విభాగానికి రూ.25.74 కోట్లు, విద్యా విభాగానికి రూ.5.49 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు బడ్జెట్‌లో పొందుపరిచారు.

ఇక ఆదాయం విషయానికి వస్తే సాధారణ పరిపాలనా విభాగం ద్వారా రూ.1,014.69 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.759.11 కోట్లు, ప్రాజెక్టుల ద్వారా రూ.844.10 కోట్లు, టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ.332.94 కోట్లు, యూసీడీ విభాగం ద్వారా రూ.13.5 కోట్లు, విద్యా విభాగం ద్వారా రూ.15 లక్షలు, పార్కులు, శ్మశానాల ద్వారా రూ.20 కోట్లు, నీటి సరఫరా విభాగం కింద రూ.462.15 కోట్లు, అమృత్ పథకం ద్వారా రూ.312 కోట్లు, విదేశీ సంస్థలు, బ్యాంకుల ద్వారా రూ.191.05 కోట్లు, ఆర్థిక సంఘం నుంచి రూ.586.25 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్సుల రూపంలో రూ.293.75 కోట్లు మొత్తం రూ.4,949.89 కోట్లు సమకూరుతుందని అంచనా వేశారు. ప్రారంభ నిల్వ రూ.664.33 కోట్లతో కలిపితే మొత్తం జమలు రూ.5,614.22 కోట్లుగా ముసాయిదా బడ్జెట్‌లో పొందుపరిచారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ముగింపు నిల్వ కింద రూ.156.99 కోట్లు చూపించారు. ఇప్పటికే ముసాయిదా బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదించడంతో కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపించాల్సి ఉంటుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

బడ్జెట్ ముసాయిదాపై విపక్షాలు అభ్యంతరం

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ ముసాయిదాపై విపక్షాలు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలిపాయి. అంకెలగారడీ అంటూ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలాశ్రీనివాసరావు విమర్శించారు. గత బడ్జెట్‌లో ఎస్సీఎస్టీలకు ఎంత ఖర్చు చేశారనేది కూడా చూపించలేదని, వారి నిధులను వారికి ఖర్చుపెట్టే పరిస్థితి లేకపోవడం అన్యాయమన్నారు. ప్రతి కార్పొరేటర్‌కు రూ.ఐదు కోట్లు కేటాయిస్తూ బడ్జెట్‌లో పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఇలాంటి బడ్జెట్‌ను తాము ఆమోదించడం లేదని మేయర్‌కు స్పష్టంచేశారు. టీడీపీ కార్పొరేటర్ రాపర్తి కన్నా మాట్లాడుతూ గత మూడేళ్లలో బడ్జెట్‌లో చూపించిన రూ.777.65 కోట్లకు సంబంధించిన ఖర్చులపై 1,407 అభ్యంతరాలను రాష్ట్ర ఆడిట్ జనరల్‌తోపాటు లోకల్ ఆడిట్ అధికారులు జీవీఎంసీకి పంపించారన్నారు. వీటికి అధికారులు ఎలాంటి సమాధానం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌పై ఆయా శాఖల అధికారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను బడ్జెట్‌లో జమ, ఖర్చులతోపాటు ఎందుకు చూపించడం లేదని మేయర్‌ను నిలదీశారు. ఇకపై వాటి వివరాలను కూడా అందుబాటులో ఉంచుతామని అదనపు కమిషనర్ వర్మ వివరణ ఇచ్చారు. జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ మేయర్ కూడా తమలాగే కార్పొరేటర్‌గానే గెలిచినప్పటికీ, వారి వార్డులో జరిగినట్టు మిగిలిన వార్డుల్లో ఎందుకు అభివృద్ధి చేయడం లేదని పోడియం ముందుకు వెళ్లి ప్రశ్నించారు. దీనికి మేయర్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆయన్ను సభ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత మిగిలిన జనసేన కార్పొరేటర్లు అభ్యంతరం తెలపడంతో సస్పెన్షన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు స్టాలిన్, బి.గంగారావు మాట్లాడుతూ వాస్తవ ఖర్చులు, ఆదాయాన్ని చూపించకుండా, ఏదో గొప్పగా ఉంటుందని బడ్జెట్‌లో ఊహాత్మక లెక్కలు చూపించారని విమర్శించారు. ముసాయిదాను సవరించాలని డిమాండ్ చేశారు. విపక్షాలు బడ్జెట్ ముసాయిదాను తిరస్కరించాలని డిమాండ్ చేస్తుండగానే మేయర్ గొలగాని హరివెంకటకుమారి జోక్యం చేసుకుని, కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రతి వార్డుకు రూ.ఐదు కోట్లు కేటాయిస్తామని చెప్పి బడ్జెట్ ముసాయిదాను ఆమోదిస్తున్నట్టు ప్రకటించి పోడియం దిగి వెళ్లిపోయారు.

భూమి హక్కులపై కొత్త చట్టాన్ని రద్దు చేయాలి

» న్యాయవాదుల డిమాండ్
» అనకాపల్లిలో ర్యాలీ, ఆర్డీవో కార్యాలయంలో ధర్నా



ఆర్డీవో కార్యాలయంలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జనవరి 9: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన 'ఏపీ భూమి హక్కుల యాజమాన్య చట్టం'ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు మంగళవారం ఇక్కడ ఆందోళన చేశారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణ్ ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులోని కోర్టు నుంచి చిననాలుగురోడ్ల జంక్షన్ మీదుగా నెహ్రూచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ధర్నా చేపట్టారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేని ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సూరా శ్రీనివాస్, బంధం వెంకటరమణ, తిలక్, భవానీ ప్రసాద్, కుమార్, హర శ్రీనివాస్, సుధాకర్, గంగాధర్, వై.సాయి, మోహన్, గోవింద్, సత్యనారాయణ, సముద్రిక లీలా పాల్గొన్నారు.

వైద్య నిపుణుల కొరత నివారణకు చర్యలు

» ఏపీవీవీపీ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్


వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్

అనకాపల్లి టౌన్, జనవరి 9: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో సమావేశమై మాట్లాడారు. పిల్లలు, మత్తు వైద్యనిపుణుల కొరత తీర్చేందుకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రక్తపరీక్షలకు సంబంధించి ఆటో ఎనలైజర్ పరికరాన్ని ఇప్పటికే వైద్యాలయానికి మంజూరు చేశామని, త్వరలో అందుబాటులో వస్తుందని కమిషనర్ చెప్పారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఎంవో లక్ష్మణ్‌శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ


అశ్వ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

నక్కపల్లి, జనవరి 9: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఉపమాకలో మంగళవారం అశ్వ వాహనంపై శ్రీవారి తిరువీధి జరిగింది. ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అశ్వవాహనంపై అలంకరించి, పూజలు చేసి హారతులిచ్చారు. పల్లకీపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, వెంకట రాజ గోపాలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రైతుల నిరసన


తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్న పెదగంగవరం రైతులు

దేవరాపల్లి, జనవరి 9: తమ భూ సమస్యలు పరిష్కరించాలని దేవరాపల్లి సమీపంలోని అనంతగిరి మండలం పెదగంగవరం రైతులు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారంతా దండం పెడుతూ మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీ రమణ, వేచలపు అప్పలనాయుడు, రామునాయుడు, అక్కునాయుడు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు

» ఇరిగేషన్ డీఈఈ జగదీశ్వరరావు


కొరుప్రోలు ఎర్ర చెరువు సర్వే చేస్తున్న అధికారులు

ఎస్.రాయవరం, జనవరి 9: గ్రామాల్లోని చెరువులు, పంట కాలువలను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పాయకరావుపేట ఇరిగేషన్ డీఈఈ జగదీశ్వరావు హెచ్చరించారు. మండలంలోని కొరుప్రోలులో ఎర్ర చెరువు గర్భం ఆక్రమణకు గురైందంటూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బీవీవీ సత్యనారాయణ ఫిర్యాదు మేరకు మంగళవారం డీఈఈ, ఏఈ చిన్నారావు, మండల సర్వేయర్ త్రిమూర్తి, రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్ర చెరువు గర్భానికి చెందిన హద్దులను గుర్తించారు. సర్వే చేసి బౌండరీలు నిర్ణయించిన తరువాత చెరువు గర్భం ఆక్రమణకు గురైనట్టు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ సర్వే రిపోర్టు అందిన వెంటనే చెరువు గర్భం ఎంత వరకు ఆక్రమణలకు గురైందనేది గుర్తించి, చర్యలు తీసుకుంటామన్నారు.

మన్యంలో జైల్‌భరో విజయవంతం

» ప్రధాన రహదారులపై అంగన్‌వాడీలు, నాయకుల బైఠాయింపు

» మన్యంలో కొనసాగుతున్న సమ్మె... నిరసన కార్యక్రమాలు

పాడేరు రూరల్, జనవరి 9: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా సమ్మె, ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న అంగన్‌వాడీలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ప్రభుత్వ బెదిరింపులకు నిరసనగా మంగళవారం నిర్వహించిన జైల్‌భరో విజయవంతమైంది. ప్రజా సంఘాల నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాడేరు, ముంచంగిపుట్టు ప్రధాన రహదారులపై బైఠాయించి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీలపై ప్రయోగించిన జీవో-2ను ఉపసంహరించుకోవాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల తొలగింపు నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. సమస్యలు పరిష్కరించాల్సిన జగన్ ప్రభుత్వం కార్మికులపై దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. బుర్ర లేని ప్రభుత్వ సలహాదారు సజ్జల తలతిక్కగా మాట్లాడటం తగదన్నారు. కాగా, జైల్‌భరో కార్యక్రమంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జి.లక్ష్మణరావు సిబ్బందితో అక్కడికి చేరుకొని జైల్‌భరోలో పాల్గొన్న వి.ఉమామహేశ్వరరావు, ఎల్.సుందరరావు, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వై.మంగమ్మ, బొజ్జన్న బుచ్చిబాబు, చిన్నారావు తదితర ముఖ్య నాయకులను అరెస్టు చేసి ప్రైవేటు వాహనాల్లో పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు స్టేషన్ వద్ద ఉంచి వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.





ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్ జంక్షన్ వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు... చింతపల్లిలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ అంగన్‌వాడీల నిరసన

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రవేశపెట్టడంతో అంగన్‌వాడీలు ఆందోళన ఉధృతం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో జైల్‌భరో కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ జంక్షన్ వద్ద బైఠాయించి మాయమాటలు చెప్పిన జగన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. సుమారు మూడు గంటల పాటు వాహన రాకపోకలు స్తంభింపజేశారు. హామీలు అమలు చేసేవరకు సమ్మె కొనసాగిస్తామని, ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా తగ్గేది లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కె.శంకరరావు, పి.భీమరాజు, ఎం.ఎం.శ్రీను, బి.సత్యవతి, మౌలమ్మ, సుజాత, యశోదమ్మ, ఈశ్వరమ్మ, భవానీ, కాంతమ్మ పాల్గొన్నారు. కాగా, ఎన్నికల ప్రచార సమయంలో అంగన్‌వాడీలకు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని దారెల సర్పంచ్ పి.పాండురంగస్వామి డిమాండ్ చేశారు.

చింతపల్లిలో...

చింతపల్లి: ప్రభుత్వం దిగొచ్చేవరకు ఆందోళనలు విరమించేదిలేదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు పెంటమ్మ స్పష్టం చేశారు. సమ్మె దీక్షా శిబిరంలో మంగళవారం కార్యకర్తలు సీఎం జగన్ వైఖరికి వ్యతిరేకంగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరడమే తప్పా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు పి.అక్కమ్మ, రాములమ్మ, నీలమ్మ, కుమారి పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె మండలంలో కొనసాగుతున్నది. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడంపై యూనియన్ బ్యాంకు సమీపంలోని జాతీయ రహదారిలో మంగళవారం పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్మాను ఎత్తివేసి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జేసీ కార్తిక్

డిక్లరేషన్ ఉంటేనే మృతుల ఓట్లు తొలగించాలి

» 18 ఏళ్లు నిండిన వారందికీ ఓటు హక్కు కల్పించాలి: జేసీ కార్తిక్

చింతపల్లి, డిసెంబరు 9: మృతుల ఓట్లను డిక్లరేషన్ ఉంటేనే తొలగించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తిక్ అన్నారు. మండల కేంద్రంలో మూడు మండలాల రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బీఎల్‌వోలు తమ పరిధిలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒకరికి ఓటు హక్కు కల్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. నూతన ఓటరు నమోదు కొరకు అర్హుల నుంచి ఫారం-6 దరఖాస్తులను స్వీకరించాలన్నారు. పూర్తి వివరాలను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే మృతులు, డబుల్ ఎంట్రీల ఓట్లను డిక్లరేషన్ తీసుకుని, దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాక తొలగించి పక్కా జాబితాను సిద్ధం చేయాలన్నారు. అలాగే ఫారం-7, 8 దరఖాస్తులను సైతం బీఎల్‌వోలు పూర్తి స్థాయిలో సమీక్షించి మార్పులు చేర్పులు చేయాలన్నారు. ప్రధానంగా పేర్లు, చిరునామా మార్పు, ఓటు బదిలీ నిర్వహించాలన్నారు. బీఎల్‌వోలు పక్కా ఓటరు జాబితా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి తహసీల్దార్లు లత్సాపాత్రుడు, ప్రసాద్, ఉప తహసీల్దార్లు రాజ్‌కుమార్, కుమారస్వామి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్' నమోదు వేగవంతం చేయండి

» పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్



గుమ్మడి కండువా ప్రజలతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

హుకుంపేట, జనవరి 9: ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని భీమవరం పంచాయతీ మారుమూల గుమ్మడి కండువా గ్రామంలో అధికారులతో కలిసి పీవో పర్యటించారు. అక్కడ నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఆదివాసీ కుటుంబాలకు ప్రభుత్వం ఆయుష్మాన్ కార్డులు అందించి రూ.5 లక్షల వరకు విలువైన వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ పథకం ద్వారా అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. భీమవరం పంచాయతీలో 24 మందికి ఇళ్లు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. అలాగే రహదారుల నిర్మాణం, తాగునీటి సదుపాయాలు కల్పించనున్నట్టు పీవో చెప్పారు. రక్తహీనతో ఇబ్బందులు పడే వారికి రూ.10 వేలు పంచన్ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ గౌరీశంకర్, రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

21న మోదకొండమ్మ తీర్థం: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్, జనవరి 9: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ తీర్థమహోత్సవాన్ని ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యులు, పలు పార్టీల నాయకులు, గ్రామ పెద్దల సమావేశంలో ఉత్సవ తేదీని ఖరారు చేశామని చెప్పారు. ఈ మహోత్సవాన్ని ప్రతి ఏటా సంక్రాంతి పండగ అనంతరం వచ్చే ఆదివారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తీర్థం రోజు ఉదయం 9 గంటల నుంచి ముగ్గుల పోటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు తమర్బ నరసింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వి.కాంతమ్మ, బీజేపీ నాయకులు కురసా పార్వతమ్మ, ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపార సంఘ నాయకులు ఆర్.నాగభూషణంరాజు, కె.నాగభూషణం, పలాసి కృష్ణారావు, కె.గంగన్నపడాల్, ఎస్.నాగేశ్వరరావు, కొట్టగుళ్లి రామారావు, శివరాత్రి శ్రీనివాస్‌కుమార్, వంతినభ రాజుబాబు, డి.బాబూరావు, ఎస్.కొండలరావు పాల్గొన్నారు.

అచ్చెన్నానాయుడును కలిసిన సివేరి అబ్రహం



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నానాయుడుతో అబ్రహం, అతని అనుచరులు

అరకులోయ, జనవరి 9: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నానాయుడును ఆ పార్టీ నాయకుడు, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహం కలిశారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో మంగళవారం తన అనుచరులతో కలిసి మాట్లాడారు. పార్టీ కోసం అందరూ సమష్టిగా కష్టించి పనిచేయాలని ఈ సందర్భంగా అచ్చెన్నానాయుడు సూచించినట్టు అబ్రహం చెప్పారు. ప్రజల్లో ఆదరణ పెంచుకోవాలని, పార్టీ అధికారంలోకి రాగానే అందరికీ తగిన ప్రాధాన్యత ఉంటుందని చెప్పారన్నారు. అబ్రహం వెంట అనంతగిరి, అరకులోయ, పెదబయలు, డుంబ్రిగుడ, హుకుంపేటల మండలాల పార్టీ ప్రతినిధులు శెట్టి బాబూరావు, అంటిపర్తి బుజ్జిబాబు, తడబారికి ఆనందరావు, పాంగి దొన్ను, కొట్యాడ అప్పారావు, బి.పొత్తి, కామేశ్వరరావు, నగేష్, దొన్ను, మాజీ ఎమ్మెల్యే సోమ సతీమణి ఇచ్చావతి, తనయుడు సురేష్, పలువురు నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమణ

సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

అధిక ఒత్తిడితో మృతి చెందిన వాసుదేవరావుకు నివాళులు

పాడేరు రూరల్, జనవరి 9: సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె విరమించేది లేదని సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు అనిల్‌కుమార్, జయరాజ్ స్పష్టం చేశారు. ఉద్యోగులు చేపట్టి సమ్మె మంగళవారం నాటికి 21వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్టు, మరి కొంతమంది విధుల్లో చేరకుంటే తొలగిస్తామని బెదిరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం షోకాజ్ నోటీసులు అందించినా వెనుకడుగు వేసేది లేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని శాంతియుతంగా 21 రోజులుగా సమ్మె చేస్తున్నామన్నారు. ప్రభుత్వం తీరుకు ఎంతో మంది ఎస్ఎస్ఏ ఉద్యోగులు అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శిబిరం వద్ద అనకాపల్లి మండలం మునగపాక మండలానికి చెందిన డేటా ఎంట్రీ ఆపరేటర్ వాసుదేవరావు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. వాసుదేవరావు ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో చురుకుగా పాల్గొనేవాడని, ఈ నెల 2వ తేదీన సమ్మె శిబిరానికి వచ్చిన ఆయన అధిక ఒత్తిడి నేపథ్యంలో స్పృహ కోల్పోయి వారం రోజులుగా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ మంగళవారం మృతి చెందడం బాధకరంగా ఉందని ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి పి.సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకొనేందుకు ఎస్ఎస్ఏ ఉద్యోగులు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులతో పాటు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఎల్.సుందరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాయకులు వాసుదేవరావుకు నివాళులర్పించారు.



అధిక ఒత్తిడికి గురై మృతి చెందిన మునగపాక డేటా ఎంట్రీ ఆపరేటర్ వాసుదేవరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

లాటరీ పేరుతో కుచ్చుటోపీ

» అనుమానం రాకుండా కొందరికి ఖరీదుకానీ వస్తువుల పంపకాలు

» ఒక్కొక్కరి వద్ద రూ.3 నుంచి రూ.7 వేల వరకు వసూళ్లు

» గిరిజన పల్లెలే లక్ష్యంగా రూ.లక్షల్లో వసూళ్లు

» వారం రోజులుగా ఫోన్ల స్విచ్ఛాఫ్...

» లబోదిబోమంటున్న బాధితులు

ఎటపాక, జనవరి 9: వారంతా అమాయక గిరిజనులు.... రోజూ కూలీకి, వ్యవసాయ పనులకు వెళితేగానీ పూట గడవనివారు... అలాంటి అమాయ కత్వాన్ని ఆసరగా చేసుకుని, కొందరు కేటుగాళ్లు లాటరీ పేరుతో బురిడీ కొట్టించారు... రూ.లక్షల్లో వసూళ్లు చేసి, చివరకు బోర్డు తిప్పేసి, ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయా మని, గ్రహించి గిరిజనులు లబోదిబో మంటున్నారు.... ఎటపాక మండలంలో చాలా మంది బాధితులు ఉండగా , ప్రధా నంగా కృష్ణవరం, భూపతిరావుపేట, కొత్తూరు, కన్నాపు రం, లక్ష్మీపురం, పాలమడుగు తదితర గ్రామాల్లోని గిరి జనులు ఉన్నారు. ఒక్కో గ్రామం నుంచి 300 నుంచి 400 వరకు బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బాధితుల్లో రూ.3 నుంచి రూ.7 వరకు వసూళ్లు చేసినట్లు తెలుస్తో ంది. ఈ గిరిజన గ్రామాలో గత మూడు నెలలుగా భద్రా ద్రి కొత్తగూడెం జిల్లా సారపాక కేంద్రంగా శ్రీ హనుమాన్ ఈజీ ఇన్‌స్టాల్‌మెంట్ లాటరీ పేరుతో కొందరు కేటుగాళ్లు ఓ బ్రౌచర్ ముద్రించి, అందులో తొలుత ప్రారంభ వారా నికి రూ.20 నుంచి చివరి వారం వరకు 307 వరకు స్కీ మ్ ఉన్నట్లు ప్రచారం నిర్వహించారు. ప్రతీవారం గ్రామా ల్లోకి వచ్చి డబ్బులు కట్టించుకుని సంతకాలు కూడా చేశారు.. అయితే ఈ లాటరీ స్కీమ్‌పై ఎవరికీ అనుమా నం రాకుండా కొందరికి తక్కువ ఖరీదైన ఫ్లాస్కో, కుక్క ర్లు, లైట్లు, ఇడ్లీ పాత్రలు ఇచ్చి, లాటరీ తగిలిందని నమ్మ బలికించే ప్రయత్నం చేశారు. దాంతో ఒకే కుటుంబంలో ఇద్దరి నుంచి ముగ్గురి పేరున లాటరీ కట్టారు. అయితే కొందరి వద్ద నుంచి రూ.5వేలు కట్టించుకుని ఫ్రిజ్‌లు, డబుల్‌కాట్ మంచాలు, డ్రెస్సింగ్ టేబుళ్లు ఇస్తామని నమ్మబలికించారు. చివరకు ఫోన్లు సిచ్ఛాఫ్ చేసి, ఉడాయించడంతో బాధిత గిరిజనులు లబోదిబో మంటున్నారు. దాదాపుగా ఎటపాక మండలంలో కేటు గాళ్లు రూ.20 నుంచి రూ.30లక్షల వరకు వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. సారపాకలో కూడా వారి ఆచూకీ లేనట్లు కొందరు బాధితులు పేర్కొంటున్నారు.



లాటరీ పేరుతో ముంద్రించిన బ్రౌచర్

సందడిగా తారుమారు సంత

... 5వ పేజీ తరువాయి

చెందిన వారు ఇక్కడికి వచ్చి తమకు కావలసిన వస్తువులు కొనుగోలు చేస్తారు. గిరిజనులు సంక్రాంతికి కావాల్సిన నిత్యావసరాలు, దుస్తులు ఈ సంతలోనే కొనుగోలు చేస్తారు. అన్ని ప్రాంతాల నుంచి జనంగా రావడంతో సంతలో సందడి నెలకొంది. పాడేరు నుంచి చింతపల్లి వెళ్లే ప్రధాన మార్గంలో వాహనాలను ఈదులబయలు గ్రామం నుంచి మధుమామిడి మీదుగా తహసీల్దార్ కార్యాలయం నుంచి రాకపోకలు సాగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా స్థానిక సీఐ రమేశ్, ఎస్ఐ శ్రీనివాస్ చర్యలు చేపట్టారు. తారుమారు సంతకు వచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సంత నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



ఫ్యాన్సీ సామగ్రి కొనుగోలు చేస్తున్న గిరిజన యువతులు

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



భోగి మంట చుట్టూ నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పాడేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులోని విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. తెలుగు సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే ఆలోచనతో భోగి, సంక్రాంతి పండుగల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అలాగే పలు సంప్రదాయ గీతాలకు బాలికలు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో భూగర్భ జల వనరుల శాఖ డీడీ మురళీధర్, బీవీకే కరస్పాండెంట్ టి.బాబూరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీసీసీ కాఫీ అవుట్‌లెట్ తొలగించొద్దు

పాడేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆవరణలో వున్న జీసీసీ కాఫీ అవుట్ లెట్‌ను తొలగించవద్దని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కాఫీ అవుట్‌లెట్‌ను తొలగించేందుకు ఐటీడీఏ అధికారులు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. కాఫీ అవుట్‌లెట్‌ను అక్కడి నుంచి తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడితే సహించబోమని ఆయన హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడే కొనసాగించాలని రామారావుదొర డిమాండ్ చేశారు.

మరణంలోనూ వీడని బంధం

» రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

» ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్ద ఘటన

» సొంతూరు కాకినాడ జిల్లా కిర్లంపూడి

» కొంతకాలం నుంచి విశాఖలో నివాసం.. విశాఖ వస్తుండగా ప్రమాదం

» వ్యక్తిగత పనులపై కారులో సొంతూరు వెళ్లిన భార్యాభర్తలు



దొరబాబు, వీరవేణి (ఫైల్)

ఎలమంచిలి, జనవరి 9: మరికొద్ది సేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన దంపతులను లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. జీవితంలోనే కాదు... మరణంలోనూ తమ బంధం విడదీయరానిదంటూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఎలమంచిలి మండల పరిధిలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా భర్త మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన ఏనుగు దొరబాబు(53), వీరవేణి(42) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు.. షణ్ముక్ ప్రవీణ్ (కోల్‌కతాలో ఉద్యోగం), సాయి సూరజ్(సీఏ చేస్తున్నాడు). దొరబాబు విశాఖలో కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. సుమారు ఏడాది క్రితం నుంచి విశాఖలోని మధురవాడలో నివాసం వుంటున్నారు. ఇదిలావుండగా వ్యక్తిగత పనుల నిమిత్తం దొరబాబు, వీరవేణి కారులో ఇటీవల సొంతూరు కిర్లంపూడి వెళ్లారు. సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో తిరిగి విశాఖపట్నం బయలుదేరారు. వీరవేణి కారు నడుపుతున్నారు. 9.45 గంటలకు ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్దకు చేరుకున్నారు. ఇక్కడ అడ్డుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, అవతలవైపునకు దూసుకుపోయింది. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొన్నది. దీంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వీరవేణి అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొరబాబును హైవే అంబులెన్స్‌లో ఎలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతదేహాలను మార్చురీకి తరలించి, మృతుల బంధువులకు సమాచారం అందించారు. చిన్నకుమారుడు సాయి సూరజ్, బంధువులు మంగళవారం ఉదయం ఇక్కడకు చేరుకున్నారు. సూరజ్, కుటుంబ సభ్యులు పోతిరెడ్డిపాలెం జంక్షన్ వద్దకు వెళ్లి ప్రమాదానికి గురైన కారును పరిశీలించి కన్నీటిపర్యంతం అయ్యారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కిర్లంపూడి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గఫూర్ తెలిపారు.

సంక్షిప్తంగా..



పాడేరులో పోలీసులు ఏర్పాటు చేసిన పోస్టర్లు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించొద్దు

» మందుబాబులకు పోలీసుల హెచ్చరిక

పాడేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని పోలీసులు హెచరిస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీలోని రహదారుల పక్కన, చెట్లతో కాస్త పచ్చదనం వున్న ప్రదేశాల్లో మందుబాబు మద్యం తాగిన అనంతరం ఖాళీ సీసాలను పగులగొడుతున్నారు. దీంతో ప్రజలు, పశువులు సైతం విరిగిన సీసాల గాజు పెంకుల కారణంగా గాయాలపాలవుతున్నారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వల్ల తగాదాలు సైతం జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలోని పలు కార్యాలయాల వద్ద ఖాళీ స్థలాల్లో సైతం మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలను వదిలేస్తున్నారు. దీంతో ఆయా ప్రదేశాలన్నీ అధ్వానంగా మారుతున్నాయి. ఈ పరిణామాలకు గమనించిన పోలీసులు జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ మద్యం సేవించవద్దని హెచ్చరిస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అలాగే ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే డయల్ 100కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. పోలీసుల హెచ్చరికలతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారి ఆగడాలు తగ్గుతాయని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విప్లవమూర్తి నీలమ్మ మృతికి మావోయిస్టుల సంతాపం

పాడేరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం పెదవంక గ్రామానికి చెందిన విప్లవమూర్తి చెల్లూరి నీలమ్మ మృతికి జోహార్లు అర్పిస్తూ సంతాపం తెలుపుతున్నామని మావోయిస్టు పార్టీ ఆంధ్ర ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతని పేరిట మీడియాకు ఓ లేఖను విడుదల చేశారు. గత ఏడాది డిసెంబరు 31న నీలమ్మ మృతి చెందిన విషయం తమకు ఆలస్యంగా తెలిసిందన్నారు. ఆమె చిన్ననాటి నుంచి విప్లవం బాట పట్టారని, అలాగే ఆమె చిన్న కుమారుడు సురేశ్ సైతం విప్లవ కార్యకర్తగా పని చేస్తున్నారని చెప్పారు. ఆ విషయం తెలిసి పోలీసులు ఆమెను ఎంతగా బెదిరించినా, ప్రలోభపెట్టినా లొంగలేదన్నారు. నీలమ్మ చివరి దశలో కుమారుడ్ని చూడాలనే కోరికను సైతం నెరవేర్చుకోకుండానే ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని వాపోయారు. అటువంటి విప్లవ మూర్తి చెల్లూరి నీలమ్మకు జోహార్లు అర్పిస్తూ సమసమాజం స్థాపించాలనే ఆమె స్ఫూర్తిని తాము కొనసాగిస్తామని మావోయిస్టు నేత గణేశ్ పేర్కొన్నారు.


'ప్రజా సంక్షేమానికే పెద్దపీట'

జి.మాడుగుల, జనవరి 9: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వైసీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మంగళవారం స్థానిక నాయకులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని సామాజిక వరాలకు సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, నాయకులు సోమలింగం, నానాజీ, చిట్టిబాబు, రామకృష్ణ, సత్యనారాయణ, అంద్రయ్య, కొండబాబు, పండన్న, దేముళ్లునాయుడు, వలసయ్య పాల్గొన్నారు.

ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలి

సీలేరు, జనవరి 9: ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలని ధారకొండ వైద్యాధికారి హిమబిందు సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు మంగళవారం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తొమ్మిది నెలల కాలంలో ఒకసారైనా అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలన్నారు. చింతపల్లిలో ఈ స్కానింగ్ చేస్తారని చెప్పారు. ప్రమాదకర ప్రసవాలుగా గుర్తించిన గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే ప్రసవ సమయానికి ఐదు రోజులు ముందుగా ఆస్పత్రిలో చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించమంటే అరెస్టు చేయడం తగదు: యూటీఎఫ్ నేతలు



యూటీఎఫ్ ప్రతినిధులు బాలక్రిష్ణ, రాజారావు

డుంబ్రిగుడ, జనవరి 9: సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల దీక్షకు భగ్నం చేస్తూ అక్రమ అరెస్టులు చేయడం తగదని యూటీఎఫ్ మండల ప్రతినిధులు బాలక్రిష్ణ, రాజారావు పేర్కొన్నారు. విజయవాడలో 36 గంటల ఉద్యోగ, ఉపా ధ్యాయ దీక్షా స్థలానికి వెళ్లనీయకుండా ఎక్కడికక్కడే అడ్డు కోవడం, నిర్బంధించడం, అరెస్టులు చేయడం సరికాద న్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ బకాయిలు, పీఎఫ్ రుణాలు తదితర ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అరెస్టు చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రభుత్వం బేషరతుగా విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మోహన్, బాబ్జి పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేతల అరెస్టులు సరికాదు

ముంచంగిపుట్టు, జనవరి 9: ఉద్యోగుల సమస్యలపై చేపడుతున్న దీక్షకు వెళ్తున్న యూటీఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు అన్నారు. ఈ అరెస్టులను వారు ఖండిస్తూ మండల కేంద్రంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిల కోసం వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నామని, దీనికి ప్రభుత్వం స్పందించకపోవడంతో రాష్ట్ర స్థాయిలో తమ నిరసన గళాన్ని వినిపించేందుకు విజయవాడ బయలుదేరామని చెప్పారు. అక్కడికి చేరుకున్న వారిని పోలీసులు అడ్డుకోవడం, అక్రమ కేసులు పెట్టడంపై ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.గోపి, సభ్యులు గణేష్, రాజేంద్ర ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.